క్లుప్తంగా

శాకంబరీ ఉత్సవాలు



వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భానుపురి : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతను కూరగాయలతో అలంకరించారు. దేవాలయంలోని నాగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వాసవీ మాతకు పూజలు జరిపారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, వాసవీ మాత పారాయణం నిర్వహించారు.

'విద్యారంగానికి అన్యాయం'

సూర్యాపేట టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,292 కోట్లు (7.3 శాతం) కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ రాష్ట్రీయ విద్యార్థి సేన పరిషత్ (టీఆర్‌వీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బంటు సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖకు మంత్రిని, సరిపడా బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. విద్యారంగానికి కనీసం 30శాతం నిధులను కేటాయించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : రైతుబీమాకు అర్హులైన రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు శోభారాణి, నేరెళ్ల సత్యం కోరారు. శుక్రవారం తిమ్మాపురం, రామన్నగూడెం రైతు వేదికలలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు వచ్చే నెల 5వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 59ఏళ్లలోపు వారు మాత్రమే రైతుబీమాకు అర్హులని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు నేరుగా వచ్చి దరఖాస్తు నింపి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆడెపు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు బైరెడ్డి మట్టారెడ్డి మృతి చెందారు. ఈ సందర్భంగా శుక్రవారం అతడి మృతదేహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తూముల భుజంగరావు నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో గజ్జెల సైదిరెడ్డి, మల్గిరెడ్డి సంజీవరెడ్డి, బైరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, గొర్ల అంజయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రమేష్



మద్దిరాల : బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా చందుపట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వంగూరు రమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నియోకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఎస్సీల సమస్యలపై పోరాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా తనిఖీ

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎల్. చరణ్ శుక్రవారం వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని కాసర్లపహాడ్ పల్లె దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, హెల్త్ అసిస్టెంట్ ఎం.రమణ, ఏఎన్ఎం శ్వేత, ఆశాకార్యకర్తలు అన్నపూర్ణ, సూజాత, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ చరణ్

ఆయిల్ బాల్స్‌తో దోమలకు చెక్

- గ్రామాల్లో ఆయిల్ బాల్స్ తయారీ
- మురుగు గుంతలు, డ్రెయినేజీల్లో వేసి దోమల వ్యాప్తికి అడ్డుకట్ట
- పారిశుద్ధ్యానికి సహకరించాలని ప్రజలకు అధికారుల సూచన

ఆత్మకూర్(ఎస్) : వర్షాకాలంలో దోమల ఉధృతిని తగ్గించేందుకు గ్రామపంచాయతీలు నూతన విధానాలను అవలంబిస్తున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, మురుగు కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరుగుతాయి. దీంతో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధుల బారిన పడి ప్రజలు అనారోగ్యానికి గురవుతారు. దీంతో ప్రజలు దోమల బారిన పడకుండా చూడడానికి గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఆయిల్ బాల్స్ తయారు చేసి దోమల పునరుత్పత్తి జరగకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నాయి. అందులో భాగంగా నీరు నిలవ ఉండే ఖాళీ ప్రదేశాలు, మురుగు గుంతల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఆయిల్ బాల్స్‌ను వేయిస్తున్నారు.

గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఆయిల్ బాల్స్ తయారీ..

పాత చీరలను ముక్కలుగా చీరి అందులో వరి ఉనకను ఉంచి బంతిలావు సైజులో మూట కట్టాలి. తర్వాత పాత ఇంజన్ ఆయిల్‌లో ఆ మూటలను ముంచి నీళ్లు నిలువ ఉన్నచోట మురుగు కాలువల్లో ఉంచాలి. దీంతో ఆయిల్ నీటిపై తెలియాడి దోమలు గుడ్లు పెడితే పగలకుండా, పిల్లలుగా తయారు కాకుండా ఉంటుంది. ఈ విధానం వల్ల దోమల ఉధృతి చాలా వరకు తగ్గుముఖం పడుతుంది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు దోమల ఉధృతిని తగ్గించడానికి ఆయిల్ బాల్స్‌ను తయారుచేయిస్తున్నారు. వాటిని ఆయా గ్రామ పంచాయతీల్లోని మురుగు గుంతలు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలవ ఉన్నచోట వేస్తున్నారు.



ఆత్మకూరులో ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న జీపీ సిబ్బంది



నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

దోమల ఉధృతి తగ్గుతుంది



వర్షాకాలం ఎక్కడ చూసినా నీరు నిల్వ ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రజలు చికెన్ గున్యా, మలేరియా, డెంగీ వ్యాధుల బారిన పడుతుంటారు. అందుకే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయిల్ బాల్స్ తయారుచేసి గ్రామంలో అవసరం ఉన్న చోటల్లా వేస్తున్నాం. దీంతో దోమల వ్యాప్తి తగ్గిపోతుంది. ప్రజలు కూడా తమ ఇళ్లలో నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ తయారుచేసి దోమల ఉధృతిని తగ్గించడానికి సహకరించాలి.

– సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

కార్గిల్ యుద్ధ వీరుడికి ఘన నివాళి

భానుపురి : కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం కార్గిల్ యుద్ధ వీరుడు గోపయ్యచారికి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చల్లా లక్ష్మయ్య పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే దేశ సరిహద్దులో సైనికుల కృషి ఎంతో దాగి ఉందన్నారు. సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సరిహద్దుల్లో పహారా కాస్తున్నారని తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్గిల్ దివస్ నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్, ఆర్‌సీ మీలా వాసుదేవ్, జెడ్సీ బెలిదే శ్రీనివాస్, పబ్బతి వేణుమాధవ్, కలకోట లక్ష్మయ్య, పబ్బతి ప్రవీణ్, శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, నాగరాజు, శ్రీశైలం, రమేష్, సోమ ఉపేందర్, బిక్కుమల్ల కృష్ణ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

సూర్యాపేటటౌన్ : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్ఐ లోకేష్ అన్నారు. శుక్రవారం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడైనా పిల్లలపై అత్యాచారాలు, అగత్యాలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రాజేష్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సునీత, బాలల పరిరక్షణ అధికారి నాగుల్ మీరా, సామాజిక కార్యకర్త శ్రీలక్ష్మి, సోషల్ మొబిలైజర్స్ వగ్గు సోమన్న, ఎలంధర్, అంజలి, వెంకటేష్, అంగన్వాడీ కార్యకర్తలు కవిత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, తదితరులు

మున్సిపాలిటీల్లో ముమ్మరంగా డ్రైడే



సూర్యాపేట : 25వ వార్డులోని ఇళ్లలో నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు



తిరుమలగిరిలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ అనసూయ, తదితరులు

సూర్యాపేట : వ్యాధులు ప్రబలకుండా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ సూచించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా 25వ వార్డు కౌన్సిలర్ ఆకుల కవితలవకుశ ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై తెలియజేయాలని సూచించారు. ఇళ్లలో నీరు నిలువ ఉండే డ్రమ్ములు, ఎయిర్ కూలర్లు, వాటర్ స్టోరేజ్ ట్యాంకులను ప్రతి శుక్రవారం ఖాళీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల లవకుశ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, మెప్మా టీఎంసీ శ్వేత, వార్డు జవాన్ కమ్రుద్దీన్, శ్రీపాది జానకిరాములు, బైరు వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూయ రాములు కోరారు. శుక్రవారం తిరుమలగిరిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలను నివారించాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలను కోరారు. ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర బాధితుల సర్వే నిర్వహిస్తున్నారని.. ఎవరికైనా జ్వరం వారికి తెలియజేసి మందులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, డాక్టర్ మల్లెల వందన, మాలోతు బిచ్చు నాయక్, సూపర్ వైజర్ స్వరూప కుమారి, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయడం హర్షణీయం

తుంగతుర్తి : రైతులకు రుణమాఫీ చేయడం హర్షణీయమని డీసీసీబీ డైరెక్టర్, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో మాట్లాడారు. మండలంలో సొసైటీ కింద 507 మంది రైతులకు గాను రూ.2,48,98,197 రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా రుణం తీసుకోవాల్సిన రైతులకు ఎకరానికి రూ.45 వేల చొప్పున రూ.1.50 లక్షల వరకు రుణం అందజేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మోదెం శ్రీలత, అసిస్టెంట్ మేనేజర్ షరీఫ్, డైరెక్టర్లు యాదగిరి, రామచంద్రు, మజీదు, భిక్షం రెడ్డి, రవీందర్ రెడ్డి, యాకయ్య, ఈదప్ప, రామ నర్సమ్మ, పూలమ్మ, చాంప్ల నాయక్, సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది యాదగిరి, మహేష్, ఉమేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

మద్దిరాల : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పల్లవి, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నేడు చలో కలెక్టరేట్

సూర్యాపేటటౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక వీఎన్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను కేటాయించడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ వినోద్ కుమార్, విష్ణు, ధరావత్ తన్వేష్, అక్కినపల్లి వినయ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలకు అంగన్‌వాడీ టీచర్లే దిక్కు

- స్కూళ్ల ప్రారంభం నుంచి ఉపాధ్యాయుల గైర్హాజరు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తుంగతుర్తి : వెలుగుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని బండ రామారం ప్రాథమిక పాఠశాల, జేత్య తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరం మొదటి నుంచి విధులకు హాజరుకావడం లేదు. దీంతో అంగన్‌వాడీ టీచర్లే ఆయా పాఠశాలలకు దిక్కుగా మారారు. ఎంఈఓ బోయిని లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బండ రామారం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు టి.వెంకట్ రాములు, జేత్య తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పి.సత్యమూర్తి పాఠశాలల ప్రారంభం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంఈఓ సదరు ఉపాధ్యాయులతో ఫోన్‌లో మాట్లాడి మెమోలు జారీ చేశారు. అయినా ఆ ఉపాధ్యాయుల్లో ఎలాంటి మార్పురాలేదు. దీంతో ఎంఈఓ వారి వేతనాలను నిలిపివేసి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పాఠశాలల నిర్వహణ కోసం ఎంఈఓ అప్పుడప్పుడు సీర్పీలను పంపిస్తున్నారు. వీరు కూడా సెలవుల్లో ఉన్నప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో అంగన్‌వాడీ టీచర్లే ఆ పాఠశాలలను చూసుకోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జేత్యా తండా పాఠశాల విద్యార్థులు

అమరవీరుల పురిటిగడ్డ.. తుంగతుర్తి

తుంగతుర్తి : ఎంతోమంది అమరవీరుల పురిటిగడ్డ తుంగతుర్తి అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మశాలీ భవనంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం పోరాటం చేసిన గడ్డ తుంగతుర్తి అని అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం, భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, దాయం రాజారెడ్డి, తొట్ల మన్సూర్, గుంటకండ్ల పిచ్చిరెడ్డి, మూల అనంతరెడ్డి, దొంగరి ముత్తులింగం లాంటి వాళ్లు వీరోచిత పోరాటాలు చేశారని గుర్తుచేశారు. నేటి పాలకవర్గాలు ఎన్నికల హామీలను పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల యాదగిరి, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బూర వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారం, సీపీఐ మండల కన్వీనర్ పాల్వాయి పున్నయ్య, సతీష్, రవీందర్, రోశయ్య, సత్యనారాయణ, దేవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

రాష్ట్ర బడ్జెట్‌లో తుంగతుర్తికి అన్యాయం

తుంగతుర్తి : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తుంగతుర్తి నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గానికి నిధులు కేటాయించుకొని, వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. తుంగతుర్తికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల మహేందర్, చిరంజీవి, శంకర్, భూతం సాగర్, ఉప్పుల లింగయ్య, పూసపల్లి శీను, కత్తుల నరేష్, పాడేటి సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రతి విద్యార్థి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ బోయిని లింగయ్య

తుంగతుర్తి : ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి బోయిని లింగయ్య అన్నారు. శుక్రవారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ సైంటిస్టులచే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిజ్ఞాస కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రయోగాలు చేయడంతో విషయ అవగాహన పెంపొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా పరిశోధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, కవిత, సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, సుమనా చక్రవర్తి, ఉపాధ్యాయులు భాస్కర్, సహదేవ్, యాకయ్య, కృష్ణవేణి, రాజన్న, రాజు, నవీన్, ప్రసాద్, ఇంతియాజ్, శ్రీనివాస్, రవికుమార్, విగ్నేశ్వరి, పుష్పలత, రమాదేవి, లావణ్య, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల నుంచి పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, వి.సైదులు, సీహెచ్. నాగరాజు, వి.అనితలను శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బొడ్డు స్వప్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్, జెడ్పీహెచ్‌ఎస్, పీఎస్‌ల ఉపాధ్యాయులు జి.చంద్రారెడ్డి, పి. రాములు, మల్లిఖార్జున్, విజిత, శోభ, కృష్ణయ్య, వెంకన్న, శ్రీనివాస్, సీనయ్య, రవీందర్, ఉపేందర్, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు రాధ, అరుణ, పరమేశ్వరి, యశోద తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురం పాఠశాలలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

రుణమాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ

అర్వపల్లి : రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతుల్లో ఎవరికైనా మాఫీ కాకపోతే వెంటనే రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకొని సమస్యను పరిష్కరించుకోవాలని తుంగతుర్తి డివిజన్ ఏడీఏ జగ్గునాయక్ కోరారు. రామన్నగూడెం రైతువేదికలో శుక్రవారం రుణమాఫీ కాని రైతుల నుంచి గ్రీవెన్స్ సందర్భంగా దరఖాస్తులను స్వీకరించారు. జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి 1,867 మంది రైతులను రూ.లక్షలోపు రుణమాఫీకి అర్హులుగా గుర్తించామని తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.3.40కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని జిల్లా అధికారులకు పంపించి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కాగా మాఫీ కాలేదు సారూ..! అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కూడా అధికారులు స్పందించారు. జాజిరెడ్డిగూడెంలోని శోభనబోయిన సంధ్య రూ.50వేలు పంటరుణం తీసుకోగా మాఫీ జరగలేదు. ఈ విషయమై అధికారులు విచారణ జరిపారు. ఆమె కుటుంబ సభ్యుల నుంచి గ్రీవెన్స్‌లో దరఖాస్తు తీసుకున్నారు. ఈ దరఖాస్తును జిల్లా అధికారులకు పంపించి మాఫీ అయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.మల్లారెడ్డి, ఏఈఓ శోభారాణి, రైతులు లింగరాజు, సత్యం, వర్ష పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏడీఏ జగ్గునాయక్

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఒకటి, రెండో అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో బోధించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యమ్మ, అంజమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము కలకలం

చివ్వెంల : పాఠశాలలోకి చొరబడి కట్లపాము కలకలం రేపింది. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జరిగింది. వివరాలు.. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు ఉండడంతో అందులో నుంచి వచ్చిన కట్లపాము తరగతి గదిలోకి ప్రవేశించింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న ఓ విద్యార్థి తండ్రి విద్యార్థుల సహాయంతో పామును చంపేశాడు. అధికారులు స్పందించి పాఠశాలలో చెత్తాచెదారం తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సరికొత్త ఆవిష్కరణలే లక్ష్యం

నూతనకల్ : రాష్ట్రంలో సరికొత్త ఆవిష్కరణలు చేపట్టడమే ఇన్నోవేషన్ సెల్ లక్ష్యమని ఇన్నోవేషన్ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ రాజు అన్నారు. శుక్రవారం నూతనకల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇన్నోవేషన్ సెల్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఆత్మకూరులో సభ్యత్వం అందిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్‌లో..

ఆత్మకూర్(ఎస్) : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) సూర్యాపేట జిల్లా కోశాధికారి గుల్ల వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలంలోని కోటి నాయక్ తండా, కాల్ బాబు సింగ్ తండా, ఏనుబావుల, పాత సూర్యాపేట, ఆత్మకూరు, నెమ్మికల్, కందగట్ల తదిత ర గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కేజీబీవీలలో బోధ న, బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షుడు పి.కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలకా రమేష్, ఉపాధ్యక్షుడు వనమాల శ్రీనివాస్, ఏ.సీనయ్య, దుర్గాప్రసాద్ రెడ్డి, రాఘవులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : కేజీబీవీ ఉద్యోగులకు కనీస వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లెఫ్టోవర్ వేకెన్సీలలో వెంటనే ప్రమోషన్లను ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని అన్నారు. పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలన్నారు. హెల్త్ కార్డులు మంజూరు చేసి ఉచిత వైద్యం అందించాలని కోరారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరపాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్. సత్యనారాయణ, నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.గోపి, బి.విజయ్ కుమార్, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నూతనకల్ : చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బత్తుల రాములమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత అందజేశారు. బాణాల సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త సుదర్శన్ రెడ్డి 50కేజీల బియ్యం, గ్రామ శాఖ ఆధ్వర్యంలో 50కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్‌లో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తి పంటను శుక్రవారం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్, మృత్తిక శాస్త్రవేత్త ఎ. కిరణ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలో సస్యరక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ సంతోష్, రైతులు సైదులు, వెంకన్న, మధు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.